సంస్థాగత ఎన్నికలకు సిద్ధంకండి

విశాలాంధ్ర - విజయనగరం ఫోర్ట్: పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని, సంస్థాగత ఎన్నికలకు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, నాయకులు సిద్ధంగా ఉండాలని ఏఐసీసీ జాయింట్ సెక్రటరీ, ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ డాక్టర్ పాలకవర్మ అన్నారు. సోమవారం విజయనగరం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయానికి విచ్చేసిన ఆయన మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి కార్యకర్తలు, నాయకులు ప్రతి ఒక్కరు కృషి చేయాలి అన్నారు. ప్రతి ఒక్కరు కష్టపడి పనిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిసిసి అధ్యక్షులు మరిపి విద్యాసాగర్, పీసీసీ సెక్రటరీ మదనమోహన్, ఏపీ యూత్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ రామారావు, విజయనగరం 7 నియోజకవర్గంల కో ఆర్డినేటర్లు జిల్లా సెక్రటరీ సనపనేని శ్రీనివాసరావు, హాసన్, హరీష్, కరీం, చంద్రమోహన్ పాల్గొన్నారు.

సీపీఐ జిల్లా కార్యదర్శిగా ఒమ్మి రమణ

15 మందితో నూతన జిల్లా కార్యవర్గం ఏర్పాటు

బొబ్బిలిలో ముగిసిన సీపీఐ 14వ జిల్లా మహాసభలు

విశాలాంధ్ర - విజయనగరం: సీపీఐ జిల్లా నూతన కార్యవర్గం ఎన్నిక ముగిసింది. ఈనెల 26, 27 తేదీలలో బొబ్బిలిలో జరిగిన సీపీఐ జిల్లా 14వ మహా సభలు విజయవంతంగా ముగిసాయి. ఈ మహా సభలలో భాగంగా జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్ను కున్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శిగా ఒమ్మి రమణను తిరిగి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. 15 మందితో నూతన జిల్లా కార్యవర్గం ఏర్పాటైంది. అలాగే 33మందితో నూతన జిల్లా సమితి కార్య వర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా సహాయ కార్యదర్శులుగా బుగత అశోక్, అలమండ ఆనందరావులను ఎన్నుకున్నారు.

సమస్యలపై పోరాటానికి ప్రణాళిక జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ

జిల్లాలో ఉన్న అనేక సమస్యలను గుర్తించి వాటి పరిష్కారం నిమిత్తం దశల వారీగా పోరాటానికి ప్రణాళిక సిద్ధం చేసుకున్నామని సీపీఐ జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ తెలిపారు. మహాసభలు అనంతరం జిల్లా కేంద్రంలోని అమర్‌భవన్‌లో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా అభివృద్ధి, నిరుద్యోగ సమస్య, పేదరిక నిర్మూలన, మూతపడిన పరిశ్రమలు, పెండింగ్‌లో ప్రాజెక్టులు ఇలా అనేక సమస్యలు ఉన్నాయని, వీటిని పరిష్కారించాలనే లక్ష్యంతో ఉద్యమించాలని తీర్మాణాలను చేసినట్లు తెలిపారు. అలాగే జిల్లాలో పలు గిరిజన రైతుల సమస్యలను, జిందాల్ వంటి సమస్యలపై సీపీఐ పోరాడుతుం దన్నారు. సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి అలమండ ఆనందరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అమలుకాని హామీలు ఇచ్చి నేడు ప్రజలను మోసం చేసిందని ఆరోపించారు. పి4తో మరింత మోసానికి తెగబడిందన్నారు. బంగారు కుటుంబాల పేరుతోనూ, దత్తత పేరుతో ప్రజలను పూర్తిగా నమ్మించడానికి ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్నారు. పేదరిక నిర్మూలన చేయడం ఎవరి తరమూ కాదని సూచించారు. 2004లో వామపక్ష పార్టీలు, కాంగ్రెస్ పార్టీల ఎలియన్స్ సమయంలో ప్రతీ రైతుకు మెట్టు ఐదెకరాలు, లేదా పల్లం 3ఎకరాలు ఉండాలనే డిమాండ్‌ను సీపీఐ ప్రవేశపెట్టిందన్నారు. దీనిపై ఆనాడు కోనేరు రంగారావు కమిటీ నివేదిక తయారు చేసిందన్నారు. రాష్ట్రంలో కోటి ఎకరాల వరకు ప్రభుత్వం భూమి ఉన్నట్లుగా కమిటీ ప్రకటించిందని తెలిపారు. తమ డిమాండ్ మేరకు వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో దాదాపు 4లక్షల వరకు ఎకరాల భూమిని పంపిణీ చేసారన్నారు. రాష్ట్రంలో డిప్యూటీ సిఎం గిరిజనుల పట్ల ప్రేమ ఉన్నట్లుగా నటించారన్నారు. చిత్తశుద్ధి ఉంటే గిరిజనులకు ఆదివాసీల అటవీ హక్కుల చట్టంను అమలు చేయాలని డిమాండ్ చేసారు. గిరిజన శాఖ మంత్రిగా ఉన్న గుమ్మడి సంధ్యారాణి గిరిజనులపై ఉన్న కేసులను రద్దు చేయించాలని, వారికి సాగు చేస్తున్న భూములకు పట్టాలను ఇప్పించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సహాయ కార్యదర్శి బుగత అశోక్, కార్యవర్గ సభ్యులు ఉల్లాకుల నీలకంతేశ్వర యాదవ్, బాయి రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

సివిల్ సప్లయి హమాలీల సమస్యలు పరిష్కరించాలి

యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.కామేశ్వరరావు

విశాలాంధ్ర - విజయనగరం టౌన్: సివిల్ సప్లయి హమాలీల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఆంధ్ర ప్రదేశ్ సివిల్ సప్లై హమాలీస్ యూనియన్ (ఏఐటీయుసి) జిల్లా ప్రధాన కార్యదర్శి పి.కామేశ్వరరావు డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించి డీఆర్వో ఎస్.శ్రీనివాసమూర్తికి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా కామేశ్వరరావు మాట్లాడుతూ జిల్లాలో 8 ఎంఎల్ఎస్ పాయింట్లలో సుమారు 200 మంది హమాలీలు 30 సంవత్సరములుగా పని చేస్తున్నారన్నారు. అయితే అప్పటికి, ఇప్పటికీ పని భారం పెరుగుతూనే ఉందన్నారు. ప్రతి రెండు సంవత్సరాలకు కూలీ రేట్లు పెంచుతున్నప్పటికీ పెరిగిన నిత్యావసర ధరలతో కుటుంబ పోషణ కూడా కష్టంగా ఉందన్నారు. మధ్యాహ్న భోజన పథకం ప్రభుత్వ వసతి గృహాల డీలర్లకు ప్రతినెల సరుకులు దిగుమతి చేసే క్రమంలో వీరికి అనేక సమస్యలు ఉత్పన్నమవుతున్నాయన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ప్రతినెలా స్టేజ్ టు బిల్లు 10వ తేదీలోగా ఇప్పించాలన్నారు. అన్లోడింగ్ బిల్ కాంట్రాక్టర్ పేరుతో కాకుండా వీరి ఖాతాలో జమ చేయాలని 15వ తేదీలోగా అవి వచ్చేలా చూడాలన్నారు. మధ్యాహ్న భోజన పథకం హాస్టల్‌కు సరఫరా చేసే బియ్యం దూరం పెరిగిందని కావున కూలీ రేట్లు పెంచాలన్నారు. హమాలీలకు చదువు లేదని వీరికి బయోమెట్రిక్ నుంచి మినహాయింపు ఇవ్వాలన్నారు. వారానికి ఒక రోజు తప్పనిసరిగా సెలవు ప్రకటించాలన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు ఎం.నరసింహులు, హమాలీలు తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ ప్లానింగ్ కార్యదర్శులు విధులు సక్రమంగా నిర్వర్తించాలి

- మున్సిపల్ కమిషనర్ లాలం రామలక్ష్మి

విశాలాంధ్ర - బొబ్బిలి: వార్డు సచివాలయ ప్లానింగ్ కార్యదర్శులు విధులు సక్రమంగా నిర్వర్తించాలని విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ లాలం రామలక్ష్మి హెచ్చరించారు. టౌన్ ప్లానింగ్ డిపార్టుమెంటుకు సంబంధించి వార్డు ప్లానింగ్, రెగ్యులేషన్ సెక్రటరీలు, టౌన్ ప్లానింగ్ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. రామలక్ష్మి మాట్లాడుతూ ప్లానింగ్ సెక్రటరీలు ఉదయం 6 గంటల నుండి ఎనిమిది గంటల వరకు సచివాలయాల పరిధిలో జాబ్ చార్ట్ ప్రకారం ఫీల్డ్ విజిట్ చేయాలని ఆదేశించారు.

సచివాలయ పరిధిలో రోడ్లు, డ్రైన్లు ఎంకరోచ్మెంట్ చేసిన వారికి నోటీసులు జారీ చేసి వాటిని తొలగించవలసిందిగా ఆదేశం చారు. సచివాలయ పరిధిలో జరుగుతున్న అనాథరైజ్డ్ కన్స్ట్రక్షన్స్ నిలుపుదల చేసి వాటికి బిల్డింగ్ ప్లాన్స్ పెట్టుకునే విధంగా చూడాలని ఆదేశించారు. ఎక్కడైనా రోడ్లపై డెబ్రీస్, బిల్డింగ్ మెటీరియల్ ఉన్న ఎడల వాటిని వెంటనే తొలగించాలని ఆదేశించారు.

నాణ్యమైన విద్యుత్ అందించేందుకు కృషి

రాష్ట్ర ఇంధన శాఖా మంత్రి గొట్టిపాటి

విశాలాంధ్ర - డెంకాడ: ప్రజలకు నాణ్యమైన విద్యుత్‌ను అందించేందుకు కృషి చేస్తున్నామని రాష్ట్ర ఇంధన శాఖామంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. డెంకాడ మండలం పెద తాడివాడ వద్ద రూ.2.8కోట్లతో 33/11 కెవి విద్యుత్ ఉపకేంద్రం నిర్మాణానికి, రాష్ట్ర ఎంఎస్ఎంఈ శాఖామంత్రి కొండపల్లి శ్రీనివాస్‌తో కలిసి మంత్రి గొట్టిపాటి రవికుమార్ సోమవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా మంత్రి రవికుమార్ మాట్లాడుతూ విద్యుత్ ఛార్జీలను పెంచకుండానే పెద్ద ఎత్తున మౌలిక వసతులను కల్పించేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. గత ప్రభుత్వం ఐదేళ్లలో 9సార్లు విద్యుత్ ఛార్జీలను పెంచడమే కాకుండా, విద్యుత్ రంగ అభివృద్ధిని పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని అన్నారు. తమ ప్రభుత్వం ఏర్పడి ఏడాది కాలంలోనే సుమారు 78,000 విద్యుత్ కనక్షన్లను మంజూరు చేసినట్లు తెలిపారు. ఈ ఏడాదిలోనే జిల్లాలో ఇప్పటికే 6 సబ్ స్టేషన్లను ప్రారంభించామని, మరో 3 నిర్మాణంలో ఉన్నాయని తెలిపారు. ప్రధానమంత్రి సూర్యఘర్ పథకం క్రింద దేశవ్యాప్తంగా కోటి ఇళ్లకు సోలార్ విద్యుత్ కనక్షన్ ఇవ్వాలని లక్ష్యం కాగా, వాటిలో 20 లక్షలను మన రాష్ట్రానికే కేటాయించడం గర్వకారణమని పేర్కొన్నారు. నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం నాగమాధవి మాట్లాడుతూ నియోజకవర్గానికి కొత్తగా 5, తీరప్రాంతానికొక విద్యుత్ సబ్ స్టేషన్ మంజూరు చేయాలని కోరామని చెప్పారు. కార్యక్రమంలో తూర్పు ప్రాంత విద్యుత్ సంస్థ సిఎండి పృధ్వీతేజ్, రాష్ట్ర మార్క్‌ఫెడ్ ఛైర్మన్ కర్రోతు బంగార్రాజు, ప్రభుత్వ విప్ వేపాడ చిరంజీవిరావు, జిల్లా ఇన్చార్జి కలెక్టర్ ఎస్.సేతు మాధవన్, ఏపిఈపిడిసిఎల్ ఎస్ఈ ఎం.లక్ష్మణరావు, ఆర్డీఓ డి.కీర్తి, ఎంపీపీ బి.వాసుదేవరావు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల తనిఖీ

విశాలాంధ్ర - జామి: మండలంలోని పలు గ్రామాలలో వున్న ఎరువుల దుకాణాలను జిల్లా టూరిజం అధికారి, మండల ప్రత్యేక అధికారి కె.కుమార్ స్వామి, వ్యవసాయ సహాయ సంచాలకులు బి.భానులతలు ఆకస్మికంగా సోమవారం తనిఖీ చేశారు. ప్రదానంగా జామి, అన్నంరాజుపేట, భీమసింగి, అలమండ గ్రామంలో తనిఖీ చేయడం జరిగింది. ఎరువులు నిల్వలు, లైసెన్స్‌లు, రిజిస్టర్‌లు పరిశీలించడంతో పాటు రైతులతో మాట్లాడారు. ఖరీఫ్ సీజన్‌కు అవసరమైన ఎరువులు అందుబాటులో ఉన్నాయని రైతులు ఎవరు ఆందోళన చెందవద్దు అన్నారు. మండలానికి యూరియా 204 మెట్రిక్ టన్నులు, డిఏపి 50 మెట్రిక్ టన్నులు, కాంప్లెక్స్ ఎరువులు 90మెట్రిక్ టన్నులు రైతు సేవకేంద్రాలు, సొసైటీ, డీలర్స్ దగ్గర ఉన్నాయన్నారు. మండలంలో మొత్తం 12 రైతుసేవా కేంద్రంలో యూరియా ఉందని, ఎరువులు ఇండెంట్ పెట్టడం జరిగిందని, స్టాక్ వస్తుందన్నారు. ఈ తనిఖీలో ఎంపీడీఓ ఎన్.అప్పల నాయుడు, వ్యవసాయ అధికారి ఎం.పూర్ణిమ, ఏఈఓ అహ్మద్ పాల్గొన్నారు.

జిందాల్ రైతులకు న్యాయం చేయాలి

విశాలాంధ్ర - శృంగవరపుకోట: జిందాల్ పుణ్యమాని నష్టపోయిన రైతులకు న్యాయం చేయాలని మాజీ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అన్నారు. సోమవారం ఉదయం స్థానిక సుబ్బిరామిరెడ్డి కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నష్టపోయిన రైతుల జాబితా సిద్ధం చేసి ప్రతిపక్షం తరుపున ప్రభుత్వంతో జిందాల్ యాజమాన్యంతో పోరాటం చేయడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ఆనాడు రాజశేఖర్ రెడ్డి హయాంలో ప్రాంత అభివృద్ధి, రాష్ట్ర అభివృద్ధి దృష్టిలో పెట్టుకుని పరిశ్రమకు భూసేకరణ జరిగిందని, మరల తమ నాయకుడు జగన్మోహన్ రెడ్డి హయాంలో ఎంఎస్ఎంఈ పార్క్‌ల ఏర్పాటుకు జీఓ తీసుకొచ్చారన్నారు. పరిశ్రమల ఏర్పాటుకు తాము అడ్డంకి కాదన్నారు. కార్యక్రమంలో శోభ హైమావతి, మండల పార్టీ అధ్యక్షులు మోపాడ కుమార్, జడ్పీటీసీ ముమ్ములూరి వెంకటలక్ష్మి, వినిశెట్టి వెంకట రమణ, రాంబాబు, జైశంకర్, స్వామి పాల్గొన్నారు.

రెండు వాహనాలు ఢీకొని వ్యక్తి మృతి

విశాలాంధ్ర - చీపురుపల్లి: చీపురుపల్లి పట్టణ శివారులోని కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయానికి సమీపంలో చిన్న చెరువు వద్ద సోమవారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో పురియవలస గ్రామానికి చెందిన కుప్పిలి శ్రీనివాసరావు (37) అనే వ్యక్తి మరణించగా కుప్పిలి నేల బాబు అనే వ్యక్తి తీవ్ర గాయాల పాలయ్యారు. చీపురుపల్లి ఎస్సై ఎల్.దామోదర్ రావు కథనం మేరకు చీపురుపల్లి నుండి పురియవలస వైపు ఏపీ 30 ఎం 5553 నెంబర్ గల పల్సర్ బైక్ మీద కురే వలస గ్రామానికి చెందిన కుప్పిలి శ్రీనివాసరావు, కుప్పిలి నేలబాబులు వస్తుండగా లాభేరు వైపు నుండి చీపురుపల్లి వైపు వస్తున్న ఏపీ 39 ఏఎ 89 67 నెంబర్ లగేజ్ వ్యాన్ అజాగ్రత్తగా నడుపుతూ ఎడమవైపు నుండి బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో శ్రీనివాసరావు అక్కడికక్కడే మృతి చెందగా నీల బాబు గాయాలు పాలవడంతో ఆసుపత్రికి తరలించి చికిత్స అందజేశారు. మృతుని భార్య కుప్పిలి మణి ఫిర్యాదు మేరకు చీపురుపల్లి ఎస్సై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దొంగతనాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

విశాలాంధ్ర - వంగర: దొంగతనాల పట్ల ప్రజలు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని చీపురుపల్లి డి.ఎస్.పి ఎస్.రాఘవులు సూచించారు. వంగర మండలం బాగెమ్మపేట గ్రామంలో అర్ధరాత్రి శంకర్రావు ఇంట్లో జరిగిన చోరీ ఘటనను పరిశీలించారు. బాధితుడు శంకర్రావు నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం డీఎస్పీ రాఘవులు మాట్లాడుతూ నిరంతరం ప్రజలు దొంగతనాలు పట్ల జాగ్రత్త వహించాలని పిలుపునిచ్చారు. గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటుతో దొంగతనాలు నియంత్రించ వచ్చునని స్పష్టం చేశారు. ఆయన వెంట రాజాం టౌన్ సిఐ అశోక్ కుమార్, వంగర ఎస్సై షేక్ శంకర్, పోలీస్ సిబ్బంది హాజరయ్యారు.

పశువుల ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలి

మండల పశు వైద్యాధికారిణి కే.గాయత్రితో విశాలాంధ్ర ఇంటర్వ్యూ

విశాలాంధ్ర - వేపాడ: ప్రస్తుతం సీజన్ వర్షాకాలం కావడంతో వర్షాలు అధికంగా కురుస్తున్నందున పశు పోషకులు పశువుల పెంపకంపై తగు జాగ్రత్తలు తీసుకోవాలని మండల పశు వైద్యాధికారిణి కోరాడ గాయత్రి అన్నారు. విశాలాంధ్ర ప్రతినిధికి ఇచ్చిన ఇంటర్వ్యూలో కొన్ని అంశాలను ఆమె పేర్కొన్నారు.

ప్రశ్న:- వర్షాకాలంలో పశువుల పెంపకానికి తీసుకోవలసిన రక్షణ చర్యలేంటి?

కె.గాయత్రి:- వర్షాకాలంలో పశువుల రక్షణకు ప్రత్యేకమైన శ్రద్ధ చూపడంతో పాటు పశువుల, జీవాల షెడ్లను, గాలివానలకు కూలిపోకుండా ముందుగానే మరమ్మత్తులు చేసుకోవాలి.

ప్రశ్న:- పశువులకు వ్యాధులు సోకకుండా తీసుకోవలసిన చర్యలు?

కె.గాయత్రి:- పశువులకు వ్యాధులు సోకకుండా టీకాలు వేయించాలి, జీవాలు పశువులకు నట్టల నివారణ మందులు వాడాలి.

ప్రశ్న:- పశువుల మేతపై తీసుకోవలసిన జాగ్రత్తలేంటి?

కె.గాయత్రి:- ముఖ్యంగా వర్షాకాలంలో పశువులకు తడిచిన దాణా, తడిచిన ఎండు గడ్డిని వినియోగించరాదు. అలాగే పరిశుభ్రమైన నీరు, దాణా అందించాలి. కావలిసిన మందులు, మేతను నిల్వ ఉంచుకోవాలి.

ప్రశ్న:- లేగ దూడల సంరక్షణపై తీసుకోవలసిన జాగ్రత్తలేంటి?

కె.గాయత్రి:- వర్షాకాలంలో లేగ దూడలు చలి బారిన పడకుండా వెచ్చని వాతావరణం కల్పించాలి. బాహ్యపరాన్న జీవుల నిర్మూలనకు క్రిమి సంహారకమందులు వాడాలి.

ప్రశ్న:- పశువులను మేతకు తీసుకెళ్లే సమయంలో పాటించాల్సిన సూచనలేమిటి?

కె.గాయత్రి:- తుఫాను లేదా వరదల సమయంలో నదీ పరివాహక ప్రాంతాలకు పశువులను, జీవాలను మేత కొరకు తీసుకొని వెళ్ళరాదు. వర్షాకాలంలో వాతావరణ కేంద్రం వారి సూచనలకు అనుగుణంగా యాజమాన్య పద్దతులు పాటించవలెను. అలాగే వర్షాలలో వ్యాధులు, మరణాలు సంభవించినప్పుడు సమీపపశువైద్యాశాలలో సంప్రదించాలని పశుపోషకులకు పాడి రైతులకు సూచించారు.

ఎరువులు కొరత లేకుండా చర్యలు

విశాలాంధ్ర - బాడంగి: ఖరీఫ్ వ్యవసాయ సాగుకు కావలసిన ఎరువులు రైతులకు సకాలంలో అందించే విధంగా ఎరువుల షాపుల యాజమాన్యం తగు చర్యలు తీసుకోవాలని బొబ్బిలి డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు ఎం.మధుసూదన్ రావు తెలిపారు. బాడంగి మండలంలో గల ఎరువుల దుకాణాలను సోమవారం తనిఖీ చేశారు. స్టాక్ నిల్వలు, ధరల వివరాలు ఎప్పటికప్పుడు బయట నోటీస్ బోర్డులలో పొందుపరచాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారి సూర్యప్రకాష్, ఏఈఓ మురళి కృష్ణ, రాంబాబు పాల్గొన్నారు.

ఎరువులు ఎమ్మార్పీ ధరలకే విక్రయించాలి

విశాలాంధ్ర - మెరకముడిదాం: మండలంలో ఎరువుల దుకాణాల్లో ఎరువులు పురుగుల మందులను ఎమ్మార్పీ ధరలకే విక్రయించాలని అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవని జిల్లా పంచాయతీ అధికారి మల్లికార్జునరావు అన్నారు. సోమవారం మండల పరిధిలో ఉన్న ఎరువుల దుకాణాలపై జిల్లా పంచాయతీ అధికారి, మండల వ్యవసాయ శాఖ అధికారిణి శ్రావణ్ తేజ సంయుక్తంగా ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో వెంకటనరసింహ ఫెర్టిలైజర్స్, శ్రీ లలితా దేవి ఫెర్టిలైజర్స్, తనిఖీలు చేపట్టి స్టాక్ రిజిస్టర్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారిణి శ్రావణ్ తేజ, సిబ్బంది పాల్గొన్నారు.

వైసీపీది కాకుల గోల.. కూటమిది హంసల పాలన..

ఎమ్మెల్యే కళా వెంకట్రావు

విశాలాంధ్ర - చీపురుపల్లి: అధికారం కోల్పోవడంతో గ్రామాల వారీగా వైసీపీ నాయకులు కాకుల మాదిరిగా గోల చేస్తున్నారని, దీనికి భిన్నంగా కూటమి ప్రభుత్వం ఇంటింటా పర్యటిస్తూ హంసల మాదిరిగా జరిపిన అభివృద్ధిని ప్రజలకు వివరిస్తుందని చీపురుపల్లి ఎమ్మెల్యే కిమిడి కళా వెంకట్రావు అన్నారు. సోమవారం చీపురుపల్లి టీడీపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. గడిచిన ఐదేళ్ల పాలనలో జగన్మోహన్ రెడ్డి రాష్ట్రంలో ప్రజాస్వామ్యాన్ని సంక్షోభంలోకి నెట్టి విధ్వంస పాలన జరిపారన్నారు. అనకాపల్లి వద్ద గ్రీన్ ఎనర్జీ ఏర్పాటుతోపాటు పారిశ్రామికంగా ఆ ప్రాంతాన్ని అభివృద్ధి చేయుట కొరకు రంగం సిద్ధం చేశారన్నారు. ఉత్తరాంధ్ర నాయకులుగా గుర్తింపు పొందిన అశోక్ గజపతిరాజు లాంటి నాయకులకు గోవా గవర్నర్ పదవిని అందజేసి ఉత్తరాంధ్ర ప్రాంతానికి తగిన గుర్తింపుని ఇచ్చారన్నారు. చీపురుపల్లి ఆర్ఇసిఎస్‌కు సంబంధించి సుప్రీంకోర్టులో వాజ్యం ఉన్నందున కొంత ఆటంకం ఏర్పడిందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కే.త్రిమూర్తుల రాజు, మండల పార్టీ అధ్యక్షులు రౌతు కామనాయుడు, మాజీ ఆర్ఎస్ఎస్ చైర్మన్ దన్నాన రామచంద్రుడు, ఆలయ కమిటీ చైర్మన్ గవిడి నాగరాజు, రౌతు నారాయణరావు, తదితరులు పాల్గొన్నారు.

సుపరిపాలన తొలిఅడుగులో మంత్రులు

విశాలాంధ్ర - భోగాపురం: మండలంలోని పోలిపల్లిలో సుపరిపాలన తొలి అడుగు కార్య క్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, చిన్న, సూక్ష్మ పరిశ్రమల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాసరావు హాజరయ్యారు. ముందుగా ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం గ్రామంలోని ఇళ్లను సందర్శించి ప్రభుత్వ పథకాలు అమలు గురించి ప్రజల వద్ద నుండి అడిగి తెలుసుకున్నారు. హుదూద్ తుఫాను సమయంలో ఇళ్లను కోల్పోయిన బాధితులకు ఇచ్చిన 44 ఇళ్ళను అలాగే గత టిడిపి ప్రభుత్వ హయాంలో కొండపైన నిర్మించిన సుమారు వందకు పైగా నిర్మించిన ఇళ్లను పరిశీలించారు. అయితే ఈ కాలనీలో ఇళ్లకు పట్టాలు లేకపోవడం, మౌలిక వసతులు లేకపోవడంతో నిర్వాసితులు ఉన్న సమస్యలును మార్కెఫెడ్ చైర్మన్ బంగార్రాజు మంత్రులు దృష్టికి తీసుకువచ్చారు. లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలని తహశీల్దార్ రవణమ్మకు మంత్రులు సూచించారు. అనంతరం మండల పార్టీ అధ్యక్షుడు కర్రోతు సత్యనారాయణ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సమావేశంలో విద్యుత్ శాఖ మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వం సంక్షేమ పాలన సాగిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవి, రాష్ట్ర కార్యదర్శి తమ్మి నాయుడు, కార్యనిర్వాహక కార్యదర్శి మహంతి చిన్ననాయుడు, నాలుగు మండలాల అధ్యక్షులు పల్లె భాస్కరరావు, కడగల ఆనందకుమార్, మహంతి శంకరరావు, జిల్లా నాయకుడు సువ్వాడ రవి శేఖర్, విక్రమ్ జగన్నాథ్, కర్రోతు రాజు పాల్గొన్నారు.

బాధితుల సమస్యలను చట్టపరిధిలో పరిష్కరించాలి

విశాలాంధ్ర - విజయనగరం టౌన్: జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రజల నుండి ఫిర్యాదులను స్వీకరించి, వాటిని పరిష్కరించేందుకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ సోమవారం నిర్వహించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రజల నుండి ఎస్పీ ఫిర్యాదులను స్వీకరించారు. జిల్లా ఎస్పీ 44 ఫిర్యాదులను స్వీకరించారు. ఆయా ఫిర్యాదుల్లో భూతగాదాలకు సంబంధించినవి 10, కుటుంబ కలహాలకు సంబంధించినవి 4, మోసాలకు పాల్పడినట్లు 4, ఇతర అంశాలకు సంబంధించి నవి 26 ఫిర్యాదులు ఉన్నాయన్నారు. సంబంధిత అధికారులు ఫిర్యాదు అంశాలను పరిశీలించాలని, వాటి పూర్వాపరాలను విచారణ చేసి, ఫిర్యాదు అంశాలు వాస్తవమైనట్లయితే చట్ట పరిధిలో చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ పి.సౌమ్యలత, ఎస్బీ సిఐ ఎ.వి.లీలారావు, డిసిఆర్బి సిఐ బి.సుధాకర్, ఎస్ఐ ప్రభావతి సిబ్బంది పాల్గొన్నారు.

సత్య డిగ్రీ, పీజీ కళాశాలలో ఎంప్లాయబిలిటీ, సాఫ్ట్ స్కిల్స్‌పై వర్క్‌షాప్

విశాలాంధ్ర - విజయనగరం టౌన్: సత్య డిగ్రీ, పీజీ కళాశాలలో డిగ్రీ తృతీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థినులకు సత్య డిగ్రీ, పీజీ కళాశాల, నాంది ఫౌండేషన్ - మహేంద్ర ప్రైడ్ క్లాస్ రూమ్ సంయుక్త ఆధ్వర్యంలో వారం రోజుల పాటు ఎంప్లాయబిలిటీ, సాఫ్ట్‌స్కిల్స్‌పై వర్క్‌షాప్ నిర్వహించారు. కళాశాల సంచాలకులు డాక్టర్ ఎం.శశి భూషణరావు, ట్రైనర్ కె.గౌతమ్, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవి సాయి దేవ మణి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ శశి భూషణరావు మాట్లాడుతూ ఇప్పటి ప్రపంచంలో, విద్యతో పాటు ప్రతిభ, వ్యక్తిత్వం, కమ్యూనికేషన్ నైపుణ్యాలు కూడా అత్యంత అవసరమని, డిగ్రీ పూర్తయ్యాక ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న యువతీ యువకులకు ఈ విధమైన శిక్షణ కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతా యన్నారు. కళాశాల సెక్రటరీ, కరెస్పాండెంట్ డాక్టర్ బొత్స ఝాన్సీ లక్ష్మీ మాట్లాడుతూ విద్యార్థులకు కావలసి సౌకర్యాలన్నీ కల్పిస్తున్నామన్నారు. విద్యార్థులు ఉద్యోగాలకు అర్హత సాధించడం కళాశాల లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ట్రైనింగ్, ప్లేస్మెంట్ ఆఫీసర్ లెఫ్టినెంట్ ఎం.ఉదయ్ కిరణ్, ఎన్‌సిసి ఆఫీసర్ కెప్టెన్ ఎం.సత్య వేణి, ఏపీ ఎస్ఎస్‌డిసి కోఆర్డినేటర్ తరుణ్ కుమార్ పట్నాయక్ పాల్గొన్నారు.

గురుదేవ ట్రస్ట్ చైర్మన్ జగదీష్‌కు మాతృవియోగం

విశాలాంధ్ర - కొత్తవలస: దేశంలోని పలు రాష్ట్రాల్లోని దివ్యాంగులకు 25ఏళ్లుగా సేవలందిస్తూ విశేష గుర్తింపు పొందిన మంగళపాలెం శ్రీ గురుదేవ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ రాపర్తి జగదీష్ బాబుకు మాతృవియోగం కలిగింది. అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన మాతృమూర్తి సుబ్బలక్ష్మి(75) విశాఖలోని కేర్ ఆసుపత్రిలో చికిత్సపొందుతూ ఆదివారం రాత్రి తుదిశ్వాసను విడిచినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. ఆమె మృతికి చింతిస్తూ పలువురు ప్రముఖులు జగదీష్‌ను, ఆయన కుటుంబసభ్యులను పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. అయితే గురుదేవ చారిటబుల్ ట్రస్ట్ ఏర్పాటు, లక్షలాది మంది దివ్యాంగులకు సేవలందించడం, గురుదేవ హాస్పటల్స్, ఇటీవల క్యాన్సర్ హాస్పటల్ ఏర్పాటు వంటి బలమైన నిర్ణయాలు ఆమె ప్రోత్సాహంతోనే ఏర్పాటుచేసి ఎందరో అభాగ్యులు, నిరుపేదలకు సేవా కార్యక్రమాలను అందిస్తున్నట్లు జగదీష్ తెలియజేశారు.

విద్యుత్ వెలుగులు

విశాలాంధ్ర ఎఫెక్ట్

విశాలాంధ్ర - రాజాం: ఈనెల 25న విశాలాంధ్ర దినపత్రికలో ప్రచురితమైన 'లైట్లు వెలగకపోయినా పట్టించుకోని సిబ్బంది' అనే కథనానికి రాజాం మున్సిపల్ కమిషనర్ జె.రామప్పలనాయుడు స్పందించారు. వెంటనే సంబంధిత సిబ్బందికి వెలగని లైట్లను వెంటనే మరమ్మతులు చేయాలని ఆదేశించడంతో సిబ్బంది కొన్ని ప్రాంతాలలో లైట్లు మరమ్మత్తలు చేసి వెలిగించడం జరిగింది. అయితే కొన్ని లైట్లు పూర్తిగా పాడైపోవడం వలన ప్రస్తుతం స్టాకు లేకపోవడం వలన స్టాక్ వచ్చిన వెంటనే మిగిలిన లైట్లు వెలిగేటట్లు చేస్తామని కమిషనర్ రామప్పలనాయుడు తెలిపారు.

వీధి దీపాల నిర్వహణకు చర్యలు

విశాలాంధ్ర - విజయనగరం: నగరంలో వీధి దీపాల నిర్వహణకు అవసరమైన అన్ని చర్యలను తీసుకుంటున్నామని విజయనగరం నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య స్పష్టం చేశారు. ఆయన ఆదేశాలతో సోమవారం ఇంజనీరింగ్ సిబ్బంది అయ్యన్నపేట, ఫూల్ బాగ్, బాబా మెట్ట, నాగవంశం వీది తదితర ప్రాంతాలలో వీధి దీపాలను సరి చేశారు. అలాగే కొన్నిచోట్ల మరమత్తులకు గురైన వీధి దీపాలను సరి చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ పల్లి నల్లనయ్య మాట్లాడుతూ వీధి దీపాలు మరమ్మతు పనులను యుద్ధ ప్రాతిపదికన చేపడుతు న్నామన్నారు. వీధి దీపాలకు అవాంతరం ఏర్పడిందని ఫిర్యాదు వచ్చిన తక్షణమే సరి చేసేందుకు సిబ్బందిని ఆదేశిస్తున్నామన్నారు. అయితే కొన్ని సాంకేతికపరమైన కారణాల వల్ల మరమ్మత్తులకు గురవుతున్నాయని, వాటిని సరిచేసి నగర వ్యాప్తంగా వెలుగులు నింపేందుకు కృషి చేస్తున్నామన్నారు.

పిజిఆర్ఎస్‌కు 165 వినతులు

అర్జీల పరిష్కారానికి అత్యంత ప్రాముఖ్యత ఇన్‌చార్జ్ కలెక్టర్ సేతు మాధవన్

విశాలాంధ్ర - విజయనగరం టౌన్: ప్రజా వినతుల పరిష్కార వేదికకు వచ్చే అర్జీదారుల వినతులకు అత్యంత ప్రాధాన్యత నిచ్చి పరిష్కరించాలని ఇంచార్జ్ కలెక్టర్ సేతు మాధవన్ తెలిపారు.సోమవారం జిల్లా కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించిన పిజిఆర్ఎస్ లో జిల్లా. ఇన్‌చార్జ్ కలెక్టర్ సేతు మాధవన్, డి.ఆర్.ఓ శ్రీనివాస మూర్తి, డిప్యూటీ కలెక్టర్ మురళీ, వెంకటేశ్వర రావు, ప్రమీలా గాంధీ ప్రజల నుండి వినతుల స్వీకరించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ అర్జీలు పునరావృతం కాకుండా నాణ్యతతో పరిష్కరించాలన్నారు. అర్జీదారుల సమస్యల పరిష్కారంలో ఎటువంటి నిర్లక్ష్యం వహించరాదని, అర్జీదారుడు సంతృప్తిచెందేలా సమస్యలను వేగంగా పరిష్కరించాలని తెలిపారు. సోమవారం పిజిఆర్ఎస్ కు 165 వినతులు అందాయి. వాటిలో భూ సమస్యలకు సంభందించి రెవిన్యూ శాఖకు అత్యధికంగా 70 వినతులు అందాయి. పంచాయతీశాఖకు 9, పింఛన్లు మంజూరు చేయాలని తదితర అంశాలపై డిఆర్డిఏకు 23 వినతులు అందాయి. మున్సిపాలిటీకి 11, విద్యా శాఖకు 08, వైద్య శాఖకు 6 , విద్యుత్ శాఖకు అందగా మిగిలినవి 4 చొప్పున అందగా మిగిలినవి ఇతర శాఖలకు చెందినవి ఉన్నాయి.

30న మార్కెట్ కమిటీ ప్రమాణ స్వీకారం

విశాలాంధ్ర - విజయనగరం ఫోర్ట్: విజయనగరం నియోజకవర్గం ఎమ్మెల్యే అతిథి గజపతిరాజు అధ్యక్షతన, మంత్రి కొండపల్లి శ్రీనివాసరావు, పాలవలస యశస్వి, సుధీర్, పెద్దల సహకారంతో మార్కెట్ కమిటీ ప్రమాణ స్వీకారం ఈనెల 30వ తేదీన జరుగుతుందని మార్కెట్ కమిటీ చైర్మన్ కర్రోతు నర్సింగరావు అన్నారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ ఈనెల 30వ తేదీ ఉదయం మార్కెట్ కమిటీ ప్రాంగణంలో ప్రమాణ స్వీకారం జరుగుతుందన్నారు. అభిమానులెవరూ పుష్పగుచ్చాలు, శాలువాలు తీసుకురావద్దని, తప్పనిసరి పరిస్థితుల్లో తీసుకురావాలంటే పెన్నులు, పుస్తకాలు తీసుకొని రావచ్చని అన్నారు. అందరూ సహకరించి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

గిరిజనుల సమస్యలు పరిష్కరించాలి

ఆదివాసి జేఏసీ రాష్ట్ర వైస్ చైర్మన్ తుమ్మి అప్పలరాజు దొర

విశాలాంధ్ర - విజయనగరం టౌన్: గిరిజనుల సమస్యల పరిష్కారం చేయాలని కోరుతూ సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ఆదివాసి జేఏసీ రాష్ట్ర వైస్ చైర్మన్ తుమ్మి అప్పలరాజు దొర నేతృత్వంలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజనుల సమస్యల పరిష్కారం చేస్తానని చెప్పిన రాష్ట్ర ప్రభుత్వం ఆ దిశగా ప్రయత్నం చేయలేదన్నారు. రామభద్రపురం మండలం మిర్తి వలస పంచాయతీలో గిరిజనులు సాగు చేసుకున్న భూముల్లో ఎటువంటి సమాచారం ఇవ్వకుండా పంట నాశనం చేయడం అన్యాయం అన్నారు. అడిగితే ఆ భూమిని 2017లో ఎం ఎస్ ఎం ఇ కి కేటాయించారని చెప్పారని కానీ 2020లో ఆర్ ఓ ఎఫ్ ఆర్ పట్టాలు ఇచ్చిందన్న విషయాన్ని గమనించలేదన్నారు. అలాగే ఎస్ కోట మండలం ముసిడిపల్లి పంచాయతీ బంద వలస గ్రామ గిరిజనులకు ఇదేవిధంగా సమాచారం లేకుండా ఏపుగా పెరిగిన 30,40 సంవత్సరాల వయసు ఉన్న జీడి, మామిడి, చింత చెట్లను తొలగించడం జరిగిందన్నారు. అలాగే జిందాల్ భూముల్లో ఎం ఎస్ ఎం ఈ పేరిట గిరిజన బాధితులు ఉన్నారన్నారు. ఎన్నో ఏళ్లగా గిరిజనులకు రోడ్లు, మంచినీరు లేక అవస్థలు పడుతున్నప్పటికీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో జేఏసీ కార్యదర్శి బి చిన్న లక్ష్మణరావు , ఎం గంగన్న దొర ,ఆర్ అప్పన్న దొర, జై లక్ష్మణరావు, కే నాగన్న దొర తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి బోరు బావికి మరమ్మతులు

విశాలాంధ్ర - వేపాడ: మండలంలోని నీలకంఠ రాజపురం పంచాయతీ శివారు భర్తవానిపాలెం గ్రామంలో తాగునీటి బోరుబావికి సోమవారం మరమ్మతులు చేపట్టారు. గ్రామానికి చెందిన పోతల తమ్మునాయుడు ఇంటి సమీపంలో గల బోరుబావి గత వారం రోజులుగా పనిచేయకపోవడంతో గ్రామ ఉపసర్పంచ్ కండిపల్లి పెదనాయుడు చొరవ తీసుకొని బోరు మెకానిక్ అచ్చంనాయుడుని పిలిపించి మరమ్మతులు చేపట్టారు. దీంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

విద్యుత్ పరికరాలు వితరణ

విశాలాంధ్ర - చీపురుపల్లి: చీపురుపల్లికి చెందిన కిల్లంశెట్టి సన్యాసిరావు తన తండ్రి జ్ఞాపకార్థం శ్రీకాకుళం జిల్లా రణస్థలం మండలంలోని కమ్మసిడం గ్రామంలో వెలసిన శ్రీ శ్రీ మహాలక్ష్మి తల్లి అమ్మవారి ఆలయానికి విద్యుత్ దీపాలను వితరణగా అందజేశారు. జిల్లా వైసీపీ ప్రచార అధ్యక్షులు వలిరెడ్డి శ్రీనివాస్ నాయుడు చేతుల మీదుగా సోమవారం ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి ఆలయానికి 10 ఎల్.ఈ.డి. ట్యూబ్ లైట్స్, 10 బల్బులు, ఆలయ నిర్వాహకులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా విఆర్టియు అధ్య క్షులు వలిరెడ్డి రవీంద్ర నాయుడు ప్రభాత్, మన్నే చిన్న తదితరులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్‌ను పరామర్శించిన కడుబండి

విశాలాంధ్ర - వేపాడ: మండలంలోని కృష్ణా రాయుడుపేట గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ అలబోని పైడిబాబు గుండె శస్త్ర చికిత్స చేయించుకుని అనారోగ్యం బారిన పడడంతో శృంగవరపుకోట మాజీ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు సోమవారం కే.ఆర్.పేటలో తన స్వగృహంలో కలిసి పరామర్శించారు. ఈ పరామర్శలో ఎంపీపీ దొగ్గ సత్యవంతుడు, మండల పార్టీ అధ్యక్షుడు మమ్ములూరి జగ్గీ బాబు, వైస్ ఎంపీపీ అడపా ఈశ్వరరావు, గ్రామ సర్పంచ్ చెలిబోని బాల బాబు, సోంపురం సర్పంచ్ మరిపిండి గంగరాజు, ఎంపీటీసీ ఆకుల సత్యనారా యణ, నాయకులు నిరుజోగి శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

నా బిడ్డలకు తల్లివందనం ఇప్పించరూ...

విశాలాంధ్ర - విజయనగరం,కంటోన్మెంట్: తన భార్య అయిదేళ్ల కిందట చనిపోయిందని, గత ప్రభుత్వంలో అమ్మ ఒడి డబ్బులు పడ్డాయని, ఈ ప్రభుత్వంలో తన ఇద్దరు పిల్లలకు తల్లి వందనం డబ్బులు పడలేదని ఫూల్ బాగ్ కాలనీకి చెందిన కె.రామకృష్ణ కలెక్టరేటులోని గ్రీవెన్సులో ఫిర్యాదు చేశాడు. తల్లి వందనం డబ్బులు మొదటి విడతలో ఎందుకు పడలేదో తెలుసుకోవడానికి సచివాలయానికి వెళ్తే అర్హుల జాబితాలోనే ఉన్నావని, పడతాయి, వెళ్లిపో అనడంతో సరేనని, ఇంటికి వచ్చేశానని, రెండో విడతలో కూడా పడలేదని రామకృష్ణ వాపోయాడు. మళ్లీ కారణం తెలుసుకోవడానికి సచివాలయానికి వెళ్ళే ప్రభుత్వం డబ్బులు వేయకపోతే మేమెక్కడి నుంచి తెచ్చి ఇస్తామని, అయినా అర్హుల జాబితాలోనే ఉన్నావు. ఏదో ఒక రోజు వడతాయిలే అంటూ నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తన ఇద్దరు పిల్లలు ప్రభుత్వ పాఠశాలలోనే చదువుతున్నారని, కూలి, పనులు చేసుకొని పిల్లలను పెంచుతున్నానని, తల్లి లేని వారికి అన్నీ తానే అయ్యి చూసుకుంటున్నానని రామకృష్ణ కన్నీటి పర్యంతమయ్యాడు.

బుచ్చంపేటలో ప్రపంచ ప్రకృతి పరిరక్షణ దినోత్సవం

విశాలాంధ్ర - రాజాం: ప్రపంచ ప్రకృతి పరిరక్షణ దినోత్సవం సందర్భంగా జూలై 28న, రాజాం జిఎంఆర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఎన్ఎస్ఎస్, యూత్ రెడ్ క్రాస్ యూనిట్ల ఆధ్వర్యంలో బుచ్చింపేట గ్రామంలో అవగాహన ర్యాలీ, మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించబడింది. సచివాలయం ఆవరణలో పలు రకాల మొక్కలను నాటి పర్యావరణ పరిరక్షణకు ముందడుగు వేశారు. గ్రామ ప్రజలలో పర్యావరణంపై అవగాహన పెంచడం, పచ్చదనాన్ని పెంపొందించడం ముఖ్య ఉద్దేశ్యం తో నిర్వహించిన ఈ కార్యక్రమంలో జిఎంఆర్ ఐటి ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డా. కె.వి.ఎస్. ప్రసాద్, గ్రామ పెద్దలు కోరాడ రామ శంకర రావు, సచివాలయం సిబ్బందిలో చంద్ర శేఖర్, రామదేవి, కిరణ్ కుమార్, అనంత్, శ్రావణి, శన్ముఖ్, రెడ్ క్రాస్ సభ్యులు పెంకి చైతన్య, మన్మధరావు, పి. సుధాకర్, ఎన్ఎస్ఎస్ యూత్ రెడ్ క్రాస్ వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

ఎట్టకేలకు స్పందించిన రెవెన్యూ అధికారులు

సంతోషం వ్యక్తం చేసిన జిందాల్ నిర్వాసితులు

విశాలాంధ్ర - శృంగవరపుకోట: గత నెల రోజులుగా జరుగుతున్న జిందాల్ నిర్వాసితుల న్యాయ పోరాటానికి ఎట్టకేలకు రెవెన్యూ అధికారుల నుండి స్పందన లభించింది. సోమవారం బొడ్డవర లో జిందాల్ నిర్వాసితులు రెవెన్యూ అధికారులకు కలిసి రైతుల సమస్యల గురించి ఆరా తీశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ, గత

నెల రోజులుగా తాము ఇబ్బంది పడుతున్న అధికారులు ఎవ రూ పట్టించుకోలేదన్నారు, చివరకు ఈ రోజు రెవెన్యూ అధికారులు వచ్చి తమ సమస్యలు తెలుసుకోవడానికి వచ్చినందుకు రైతులు సంతోషించారు.రైతులు త్వరలోనే తమ సమస్యలు పరిష్కారం అవుతాయి అంటూ ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ, మేము ప్రభుత్వ యంత్రాంగానికి భయపడి, రోడ్ల మీద కి రాకుండా ఇంట్లో ఉండలేదని. రాజ్యాంగ వ్యవస్థపై నమ్మకం ఉంచి శాంతియుతంగా నిబంధనలకు అనుగుణంగా ప్రజాస్వామ్య బద్ధంగా నిరసన తెలిపామని. తమ ఈ శాంతియుత పోరాటం త్వరలోనే ఫలితాలు ఇస్తుంది అని ఆశాభావం వ్యక్తం చేశారు.

ఎరువుల దుకాణాల తనిఖీ

విశాలాంధ్ర - డెంకాడ: మండలంలోని డెంకాడ గ్రామంలో సాయి కృష్ణ రైతు మిత్ర గ్రూపు, ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం షాపులను సోమవారం మండల రెవెన్యూ అధికారి ఎం.రాజారావు, సహాయ వ్యవసాయ సంచాలకులు ఎ.నాగభూషణరావు, మండల వ్యవసాయ అధికారిని టి.సంగీత పరిశీలించారు. మండల రెవెన్యూ అధికారి ఎం.రాజారావు మాట్లాడుతూ ఎరువులను భూమి ఉన్న రైతుకు ఒక బస్తా చొప్పున ఇవ్వాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి బి.రామకోటి పాల్గొన్నారు.

పట్టణాభివృద్ధికి సహకరించండి: ఎమ్మెల్యే కోళ్ల

విశాలాంధ్ర - శృంగవరపుకోట: పట్టణంలో ఎన్నో ఏళ్లుగా విశాఖ అరకు ప్రధాన రహదారి వర్షం పడితే చెరువును తలపిస్తున్న విషయం తెలిసిందే. దీనికి ప్రధాన కారణం రోడ్డుకు ఇరువైపులా ఉన్న నాళాలు మూసుకుపోవడం. రోడ్డు ఇరువైపులా స్థలాలు ఆక్రమించి వాటిలో వివిధ షాపులు నిర్మించడం వలన వర్షం పడితే నీరు ఎటు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. సోమవారం స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో మండల అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి మాట్లాడారు. రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఆక్రమణలు తొలగించేందుకు పోలీస్ సిబ్బంది సహకారంతో తక్షణమే తొలిగించి పనులు ప్రారంభించవల సిందిగా ఆదేశాలు జారీ చేశారు. దీని కొరకు పట్టణ ప్రజలు వ్యాపారస్తులు అందరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీ టూరిజం డైరెక్టర్ ఐ.సుధారాణి, ఎంపీపీ ఎస్.సోమేశ్వరరావు, ఎమ్మార్వో శ్రీనివాసరావు, ఎంపీడీవో సతీష్, ఆర్ అండ్ బి జెఈ, పిఆర్ జెఈ, ఈవో అనురాధ, ఈవోపిఆర్డి శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

ఎరువులు దుకాణాలు తనిఖీ

విశాలాంధ్ర భోగాపురం: మండల కేంద్రంలోని పలు ప్రైవేటు ఎరువుల దుకాణాలను మండల ప్రత్యేక అధికారి శాంతి సోమవారం ఆకస్మిక తనిఖీలు చేపట్టారు ఎరువులకు సంబంధించిన స్టాక్ రికార్డులు నిలువ ఉంచిన ఎరువులు వివరాలను పరిశీలించారు. డీలర్లతో మాట్లాడుతూ గోదాంలో అనుమతులు మేరకే స్టాక్ ను ఉంచాలని సూచించారు ప్రభుత్వం నిర్దేశించిన ధరలకు ఎరువులు విక్రయించాలనిచెప్పారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులకు సరిపడా ఎరువులు అందుబాటులో ఉన్నాయని సూచించారు ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి కే హైమవతి, మండల వ్యవసాయ విస్తరణ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పథకాలు ఇవ్వకుండా మోసం చేస్తున్న చంద్రబాబు

విశాలాంధ్ర - వేపాడ: నాడు ఎన్నికల ముందు అంతులేని హామీలు ఇచ్చి ప్రజలకు పథకాలు ఇవ్వకుండా మోసం చేస్తున్న ముఖ్యమంత్రి ఎవరైనా ఉన్నారంటే అది నారా చంద్రబాబునాయుడని శృంగవరపుకోట మాజీ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని కుమ్మపల్లి, కృష్ణా రాయుడుపేట గ్రామాలలో బాబు షూరిటీ - మోసం గ్యారంటీ అంటూ ఇంటింటా ప్రచారం వైసీపీ రాష్ట్ర బూత్ కమిటీ వింగ్ సెక్రటరీ, ఎంపీపీ దొగ్గ సత్యవంతుడు, మండల పార్టీ అధ్యక్షులు మమ్ములూరి జగన్నాథం, వైస్ ఎంపీపీ అడపా ఈశ్వరరావులతో కలసి నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నికల్లో 50 ఏళ్లకే పింఛన్ ఇస్తానని ఏడాది పూర్తయినా నేటికి అమలు చేయలేదన్నారు. ఈ కార్యక్రమంలో మండల జేసీఎస్ కన్వీనర్ భోజంకి శ్రీను, కుమ్మపల్లి సర్పంచ్ నౌడు అరుణ శ్రీనివాసరావు, కెఆర్ పేట సర్పంచ్ చెలిబోని బాల బాబు, ఎంపిటిసి సభ్యులు ఆకుల సత్తిబాబు, సోంపురం సర్పంచ్ మురిపిండి గంగరాజు, నీరుజోగి శ్రీను పాల్గొన్నారు.

శృంగవరపుకోట: మాజీ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సోమవారం శృంగవరపుకోట పట్టణంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి గత ప్రభుత్వంలో జగన్మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలపై ఇంటింటికి చేకూరిన లబ్ధిని, ప్రస్తుత ప్రభుత్వ మోసాలను వివరించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు మోపాడ కుమార్, ఎస్.కోట టౌన్ అధ్యక్షులు షేక్ రెహమాన్ తదితరులు పాల్గొన్నారు.

భోగాపురం : సంక్షేమ పథకాలు ఎక్కడ అని మాజీ ఎమ్మెల్యే బడ్డు కొండ అప్పలనాయుడు కూటమి ప్రభుత్వాన్ని ప్రశించారు . వైకాపా మండల అధ్యక్షుడు ఉప్పాడ సూర్యనారాయణ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన బాబు షూరిటీ మోసం గ్యారంటీ కార్యక్రమంలో చాకివలస, భోగాపురం, నందిగాం, ముంజేరు, చేపల కంచేరు, రామచంద్ర పేట, చెరుకుపల్లి, గుడివాడ, రాజపులోవ పంచాయితీలలో జరిగిన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత ఎమ్మెల్యే నెల్లిమర్ల నియోజకవర్గాన్ని అమెరికాలా మారుస్తునని, వందరోజుల్లో వంద కంపెనీలు తీసుకువస్తానని ప్రగల్భాలు పలికిందని ఎద్దేవా చేసారు. ఎన్నికల ముందు ప్లాస్టిక్ డొక్కు ఇచ్చి అందరి డొక్కలు ఎండగట్టింది అన్నారు. తాను ఇచ్చిన ఎన్నికల వాగ్దానాలను అమలు చేసి చూపాలన్నారు. ఆమె హయాంలో ఎంత మందికి ఉద్యోగాలు ఇచ్చింది తెలపాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి అభిమానులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

బొబ్బిలి : కూటమి ప్రభుత్వం మేనిఫెస్టో ను గుర్తుకు తెస్తూ రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో కార్యక్రమంలో భాగంగా సోమవారం పురపాలక సంఘం పరిధిలో గల 9వ వార్డులో మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు పట్టణ వైసీపీ నాయకులతో కలిసి చంద్రబాబు మేనిఫెస్టోను గుర్తుకు చేస్తూ ఇంటింటికి తిరుగుతూ ప్రజలకు గుర్తుకు చేస్తూ కూటమి ప్రభుత్వం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ లు ఎన్నికల హామీల్లో ప్రజలకు ఇచ్చిన సూపర్ సిక్స్ సంక్షేమ పథకాల అమలు చేయడంలో తీవ్రంగా విఫలం చెందిందని మోసాలను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లాపార్టీ ప్రధాన కార్యదర్శి శంబంగి వేణుగోపాలనాయుడు, పట్టణ పార్టీ అధ్యక్షుడు చోడగంజి రమేష్ నాయుడు,మాజీ మున్సిపల్ చైర్మన్ సావు వెంకట మురళీకృష్ణరావు,వార్డు ఇంచార్జ్ కొమోజి హరిబాబు,వైసీపీ సీనియర్ నాయకులు ఇంటి గోపాలరావు,తూముల భాస్కరరావు,వివిధ వార్డు ఇంచార్జ్ లు,వైసీపీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

చీపురుపల్లి: మండలంలోని బతికేయవలస గ్రామంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బాబు షూరిటీ మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విజయనగరం పార్లమెంటు మాజీ సభ్యుడు బెల్లం చంద్రశేఖర్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోసపూరిత హామీలతో చంద్రబాబు, పవన్ కళ్యాణ్ లు ప్రజలను నమ్మించి మోసం చేసారన్నారు. చంద్రబాబు వచ్చాక తమకు రైతు భరోసా కింద ఆర్థిక సాయం అందలేదని రైతులు లబోదిబోమం టున్నారని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు జిల్లా వైస్సార్ పార్టీ ఇంటిలెక్టచువల్ అధ్యక్షులు కొంచాడ శ్రీనివాస కుమార్, రాష్ట్ర రైతు విభాగం జాయింట్ సెక్రటరీ దన్నా న జనార్ధన్, నియోజకవర్గం వాలంటీర్ విభాగం అధ్యక్షులు బెల్లానత్రినాథరావు, నియోజకవర్గం మేధావి విభాగం అధ్యక్షులు రాజు, ధన్నానపద్మావతి కర్రోతు ప్రసాద్, సుంకరి శేఖర్ గుప్తా, వెంకీ,గణేష్ ,మొగుది రమణ, రామారావు, వైస్సార్ సిపి నాయకులు, కార్యకర్తలు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

సహకార రంగంతోనే అభివృద్ధి

- సహకార భారతి రాష్ట్ర అధ్యక్షుడు అద్దూరి

విశాలాంధ్ర - విజయనగరం ఫోర్ట్: సహకార రంగం అభివృద్ధి చెందితేనే సామాజికాభివృద్ధి తద్వారా దేశాభివృద్ధి సాధ్యమని సహకార భారతి రాష్ట్ర అధ్యక్షుడు అద్దూరి శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం సాయంత్రం స్థానిక రహదారి బంగళా వద్ద గల కలాం ఫౌండేషన్ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన సహకార భారతి విజయనగరం జిల్లా సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. 1957లో ఏర్పాటైన సహకార భారతి ద్వారా అనేక మంది సహకార రంగంలో తమ ప్రాంతాలను అభివృద్ధి చేసుకోవడంతో పాటు రాజకీయ రంగంలోనూ రాణించారని అన్నారు. ఉత్తరాది రాష్ట్రాల్లో సహకార రంగాన్ని అభివృద్ధి చేయడం వలనే ఆయా రాష్ట్రాల రైతులకు, ప్రజలకు ఉపాధి అవకాశాలు కల్పించగలిగాయని తెలిపారు. ముఖ్యంగా మహారాష్ట్రలో చక్కెర కర్మాగారాలు, గుజరాత్ రాష్ట్రంలో పాడి పరిశ్రమ అభివృద్ధి, వివిధ రంగాల్లో అభివృద్ధిని కనబరిచాయన్నారు. ఉత్తరాంధ్ర ఆరు జిల్లాలలో సమన్వయకర్తలు మమ్ముల తిరుపతిరావు, అమరా సర్వదేవుళ్లు ఆధ్వర్యంలో మంచి నిబద్ధత కలిగిన కమిటీలు వేసామని రాష్ట్రంలోనే ఆదర్శవంతమైన సహకార సంఘాల ఏర్పాటుకు కృషి చేస్తామని తెలిపారు. ముందుగా మాజీ రాష్ట్రపతి, భారతరత్న డాక్టర్ ఏపిజే అబ్దుల్ కలామ్ 10వ వర్ధంతి సందర్భంగా ఆయనకు ఘన నివాళి అర్పించారు. అనంతరం సామాజిక సేవా రంగం నుండి రాజకీయ రంగంలోకి వచ్చి కెల్ల పిఏసిఎస్ చైర్మన్‌గా నియమితులైన టియస్డీయఫ్ అధ్యక్షురాలు కె.విమలారాణిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జాతీయ కౌన్సిల్ సభ్యురాలు జానకీదేవి, ఇంటర్నేషనల్ యునైటెడ్ కలాం ఫౌండేషన్ ఏపి అధ్యక్షుడు మమ్ముల తిరుపతిరావు, చేనేత విభాగం రాష్ట్ర ప్రముఖ్ రామక్రిష్ణ, జిల్లా అధ్యక్షుడు జాగరపు ఈశ్వర ప్రసాద్, ప్రధాన కార్యదర్శి మార్పిన అప్పలనాయుడు, సహ కార్యదర్శి త్యాడ రామకృష్ణారావు (బాలు) మహిళా ప్రముఖ్ పద్మలత, సహ ప్రముఖ్ కె ప్రవల్లిక, సభ్యులు కొల్లి సత్యనారాయణ, ఆశపు లోకేష్, డ్వాక్రా ప్రముఖ్ దుక్క క్రిష్ణవేణి, శ్రీకాకుళం అధ్యక్షుడు రౌతు సాంబమూర్తి తదితరులు పాల్గొన్నారు.

అక్రమ వసూళ్ల వలలో పడకండి

పారిశుధ్య కార్మికులకు కమిషనర్ సూచన

ఎటువంటి పోస్టులు కార్పొరేషన్ లో భర్తీ చేయడం లేదని గుర్తించాలని పత్రిక ప్రకటన ద్వారా కమిషనర్ తెలిపారు.

విశాలాంధ్ర - విజయనగరం: నగరంలో మెరుగైన పారిశుధ్య విధానం అమలు నిమిత్తం ఈమధ్య కౌన్సిల్ అనుమతితో ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన శారీరకంగా ధృఢత్వం గల పురుషులను 45 మందిని ఓ ప్రైవేటు కాంట్రాక్టర్ వద్ద పనిచేసేందుకు వీధుల్లోకి తీసుకునేందుకు నిర్ణయించడమైనదని, అయితే కొందరు దీనికోసం లక్షల రూపాయలు వసూలు చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, ఇటువంటి మోసపూరిత చర్యలకు ఎవరు బలి కావద్దని విజయనగరం నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య తెలిపారు. పారిశుధ్య పనుల కోసం కాంట్రాక్టర్ పనిలోకి తీసుకున్న వ్యక్తులు కేవలం తాత్కాలికమేనని గుర్తించాలన్నారు. కార్పొరేషన్ లో పనిగా ఏ ఒక్కరూ పరిగణించరాదని అన్నారు. ఈ తరహా పని కోసం ఎవరైనా లంచం అడిగితే తక్షణం తమ దృష్టికి తీసుకురావాలన్నారు. పారిశుధ్య పనిలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే మరుక్షణం సదరు కాంట్రాక్టర్ పనిలో నుండి తొలగించి వేస్తారని స్పష్టం చేశారు. కావున నగరపాలక సంస్థలో పోస్టులు ఉన్నాయని, లంచాలు ఇచ్చి మోసపోరాదని తెలిపారు.

20 సంవత్సరాలుగా సొంత భవనం లేక విద్యార్థుల అవస్థలు

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆందోళన

విశాలాంధ్ర - విజయనగరం టౌన్: భారతి విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట రెడ్డి వానివలస గ్రామంలో పాఠశాలకు సొంత భవనం ఏర్పాటు చేయాలని ఆందోళన చేయడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఎస్ఎఫ్ఐ నాయకులు తల్లిదండ్రులు మాట్లాడుతూ 1980లో కూలిపోయినటువంటి పాఠశాల భవనాన్ని ఇప్పటివరకు ఏర్పాటు చేయలేదన్నారు. ఆ పాఠశాలలో 30 మంది విద్యార్థులు ఉన్నారని. ఇద్దరు టీచర్లు వస్తున్నారన్నారు. చదువు బాగా చెప్తున్నప్పటికీ సొంత భవనము, మౌలిక సదుపాయాలు లేక విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారన్నారు. నాడు - నేడు లో నిధులు మంజూరు ఐనప్పటికి వేరే పాఠశాలకు మళ్లించడం వల్ల ఈ పాఠశాలవిద్యార్థులకు అన్యాయం జరిగిందన్నారు. నమ్మి ఓట్లు వేసినటువంటి గిరిజన శాఖ మంత్రి, గ్రామ సర్పంచ్ ను కలిసినప్పటికీ ఎటువంటి మేలు జరగలేదన్నారు. నాడు-నేడు కి తీసుకొచ్చినటువంటి సిమెంట్ బస్తాలు మధ్యలో పిల్లలు చదువుకోవడం వల్ల అనేక అనారోగ్య సమస్యలకు గురవుతున్నారన్నారు. పిల్లలకు ఆడుకోవడానికి మంచి ఆట స్థలంగాని, చదువుకోవడానికి స్థలంగాని, కనీసం తినడానికి కూడా స్థలం లేదన్నారు. ఉపన్యాసాలు ఇచ్చే నాయకులకు పసిపిల్లల గోష పట్టడంలేదన్నారు. వెంటనే రెడ్డివానివలస పాఠశాల భవనాన్ని ఏర్పాటు చేయాలని, లేని పక్షంలో మరింత ఉధృతంగా ఉద్యమాలు నిర్మిస్తామని ఎస్ఎఫ్ఐ డిమాండ్ చేసింది. ఈ కార్యక్రమంలో ఎస్ ఎఫ్ ఐ జిల్లా అధ్యక్షులు డి.రాము, సహాయ కార్యదర్శి ఆర్. శిరీష, జిల్లా నాయకులు రాజు, గౌరీ, విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వసతి గృహాలను సందర్శించిన ఈశ్వర కౌశిక్

విశాలాంధ్ర - విజయనగరం టౌన్: వైసీపీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి సూచన మేరకు మాజీ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి నాయకత్వంలో విజయనగరం నియోజకవర్గం యువజన విద్యార్థి విభాగం ఇంచార్జ్ ఈశ్వర్ కౌశిక్ సోమవారం 7వ డివిజన్లో దాసన్న పేట, 31వ డివిజన్లో పద్మావతి నగర్ లో ఉన్న (బీసీ హాస్టల్) ప్రభుత్వ వెనుకబడిన తరగతుల బాలుర వసతి గృహాలను సందర్శించారు. అక్కడ ఉన్న వసతి తీరును విద్యార్థులను అడిగి తెలుసుకొని ప్రత్యక్షంగా పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఈశ్వర్ కౌశిక్ మాట్లాడుతూ దాసన్నపేట లో ఉన్న వసతి గృహం శిధిలావస్థకు చేరుకుందని, దీనివల్ల మరుగుదొడ్ల, స్నానాలకు విద్యార్థులు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు వసతి గృహాలకు పెద్దపీట వేయడం జరిగిందన్నారు. ప్రస్తుతం జిల్లావ్యాప్తంగా ఉండే వసతి గృహాల్లో అనేక సమస్యలు ఉన్నాయన్నారు. వసతి గృహాల్లో ఉన్న అసౌకర్యాలను, లోటుపాట్లను జిల్లా కలెక్టర్‌కి వినతి పత్రం ద్వారా ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ యువజన విభాగ ఇంచార్జ్ బోడసింగి ఈశ్వరరావు, యువజన విభాగ నాయకులు భార్గవ్, పవన్, లంక సురేష్, ఉమా, నల్లితేజ, విద్యార్థి విభాగం నాయకులు పొన్నాడ మణికంఠ, వివేక్, హర్ష, మణి భగవాన్, బన్నీ, జస్వంత్ లతో పాటు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అభిమానులు పాల్గొన్నారు.

వైభవంగా ఆండాళ్ తిరు నక్షత్ర మహోత్సవం

విశాలాంధ్ర - విజయనగరం టౌన్: శ్రావణ శుద్ధ దశమి సోమవారం గోదాదేవి (జన్మదినం) తిరునక్షత్రం సందర్భంగా విశేష కుంకుమ పూజలు జరిగాయి. శ్రీమన్నార్ రాజగోపాలస్వామి దేవాలయం వద్ద ఉదయం 9 గంటలనుండి ప్రత్యేక కుంకుమ పూజలు నిర్వహించారు. సుమారు 1000 మంది మహిళలు పాల్గొన్న ఈ కార్యక్రమంనకు అవసరమైన పూజాద్రవ్యములు మంచుకొండ ఆళ్వార్ కుటుంబ సభ్యులు ఉచితంగా అందజేశారు. ఆలయ ప్రధాన అర్చకులు ఫణిహారం మణిబాబు ఆధ్వర్యంలో గోదాదేవికి విశేష కుంకుమ పూజలు జరిగాయి. నిర్వాహకుడు బొడ్డు వెంకటేశ్వర ప్రసాద్ (పండు) పర్యవేక్షణ లో వేదంపండితుల సమక్షంలో మేలతాళాలతో అంగరంగ వైభవంగా కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో మిత్రమ%శీ%డలి సభ్యులు నారాయణం లక్ష్మణరావు, గోపాల్, మంగరాజు, కోటి, జగదీశ్, కుమార్ బాబు పాల్గొని అన్ని ఏర్పాట్లు చేశారు. అనంతరం భక్తులకు ప్రసాద వితరణ చేశారు.

ఖాతాదారులు సేవలో వాణిజ్య బ్యాంకులతో పోటీపడాలి

డిసిసిబి చైర్మన్ కిమిడి నాగార్జున

విశాలాంధ్ర - చీపురుపల్లి: ఖాతాదారులకు సేవలు అందించటంలో వాణిజ్య బ్యాంకులతో పోటీ పడాలని చీపురుపల్లి కోపరేటివ్ బ్యాంక్ ఉద్యోగులకు డిసిసిబి చైర్మన్, టిడిపి జిల్లా అధ్యక్షులు కిమిడి నాగార్జున సూచించారు. చీపురుపల్లి బ్యాంకును ఆయన సోమవారం ఆకస్మిక తనిఖీ చేశారు. బ్యాంక్ పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా నాగార్జున మాట్లాడుతూ బ్యాంకు వ్యాపారం రూ.150 కోట్లకు పెంచాలని, డిపాజిట్లను అధికం చేయాలని సూచించారు. డ్వాక్రా సంఘాలకు సంబంధించి బ్యాంక్ ఖాతాలను కోపరేటివ్ బ్యాంకులో తెరిచి వ్యాపారాన్ని పెంచాలన్నారు. బ్యాంక్ అందించే సేవలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. బ్యాంకు పరిసరాలను శుభ్రం చెయ్యాలిని సూచించారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు మేనేజర్ కే.కల్పన, సిబ్బంది సంతోష్, ఝాన్సీ, మహంతి వేణు పాల్గొన్నారు.

విత్తన బంతుల వినియోగంపై అవగాహన

విశాలాంధ్ర - విజయనగరం టౌన్: వరల్డ్ నేచర్ కన్జర్వేషన్ డేను పురస్కరించుకుని మహారాజా కాలేజ్ ఆఫ్ ఫార్మసీ, విజయనగరం జాతీయ సేవా పథకం (ఎన్ ఎస్ ఎస్) శాఖ ఆధ్వర్యంలో "పచ్చటి భూమికి మన వంతు సహకారం" అనే నినాదంతో కోట జంక్షన్ వద్ద విత్తన బంతుల వినియోగంపై అవగాహన కార్యక్రమం నిర్వహించబడింది. ఈ సందర్భంగా పర్యావరణ పరిరక్షణకు విత్తన బంతుల ఉపయోగాన్ని తెలియజేసే విధంగా

అవగాహన కల్పించబడింది. విత్తన బంతుల తయారీ ప్రక్రియ, వర్షాకాలంలో వాటి ఉపయోగకరత, స్వాభావికంగా మొక్కలు పెరిగే విధానం వంటి అంశాలను ప్రజలకు వివరించారు. కళాశాల ప్రిన్సిపల్ డా. ఎం. రామయ్య మాట్లాడుతూ, "ప్రకృతి పరిరక్షణ మనందరి బాధ్యతని విత్తన బంతులు పర్యావరణ సమతుల్యత కోసం అధిక ఖర్చు లేకుండా సుళభమైన పరిష్కారమని. ప్రతి ఒక్కరూ ఈ ప్రక్రియలో భాగస్వాములు కావాలన్నారు. ఈ కార్యక్రమాన్ని ఫార్మాకోగ్నసీ, ఫైటోకెమిస్ట్రీ విభాగం సమన్వయంతో విజయవంతంగా నిర్వహించగా, అధ్యాపకులు, విద్యార్థులు, వాలంటీర్లు చురుకుగా పాల్గొన్నారు. పర్యావరణ సుస్థిరత కోసం ఈ తరహా కార్యక్రమాలు ప్రతి విద్యా సంస్థలో నిర్వహించాల్సిన అవసరం ఉందని వారు అభిప్రాయపడ్డారు.

ఎమ్మెల్యే బేబీ నాయనకు రౌతు రామ్మూర్తి నాయుడు ధన్యవాదాలు

విశాలాంధ్ర - బొబ్బిలి : రాష్ట్ర గ్రంథాలయ డైరెక్టర్ గా నియమించిన ఎమ్మెల్యే ఆర్ వి ఎస్ కె కే రంగారావు (బేబి నాయన)కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు రాష్ట్ర గ్రంథాలయ డైరెక్టుగా నియమితులైన రౌతు రామ్మూర్తి నాయుడు తెలిపారు. ఎమ్మెల్యే బేబీనాయన తో పాటు మాజీ మంత్రి సుజయ్ కృష్ణ రంగారావు , మాజీ ఎమ్మెల్యే బొబ్బిలి అర్బన్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ తెంటు లక్ష్మి నాయుడు లు సహకారంతో తనకు ఈ పదవి లభించిందని నాయకులందరూ విశ్వాసాన్ని అభిమానాన్ని వమ్ము చేయకుండా తనపై నమ్మకంతో ఇచ్చిన పదవికి పూర్తి న్యాయం చేస్తానని రౌతు రామ్మూర్తి నాయుడు తెలిపారు అలాగని తలపై విశ్వాసంతో ఈ పదవిని ఇచ్చిన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు, రాష్ట్ర విద్యా ఐటీ మంత్రి నారా లోకేష్, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కు కృతజ్ఞతలు తెలిపారు . తనకు

అప్పగించిన బాధ్యతలను బాధ్యతాయుతంగా, నమ్మకంతో నెరవేస్తానని ప్రభుత్వానికి ప్రభుత్వ పెద్దలకు ఎలాంటి సమస్యలు లేకుండా తన విధులు నిర్వహిస్తానని ప్రజా సంక్షేమానికి పాటుపడతారని అలాగనే నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ అభివృద్ధికి ఎమ్మెల్యే బేబి నాయన ఆశీస్సులతో తన విధులు నిర్వహిస్తానని తెలిపారు.